

విశాలాంధ్ర అనకాపల్లి

పేజి నెం. 6

మంగళవారం 2, సెప్టెంబర్ 2025

ప్రజా సమస్యలు పరిష్కారానికై కూటమి ప్రభుత్వం కృషి : హోంమంత్రి అనిత

విశాలాంధ్ర-యస్ .రాయవరం : ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వము కృషి చేస్తుందని రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పెనుగొల్లు గ్రామంలో పరిశీలించారు. ఇంటింటికి తిరిగి పింఛన్ లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజల కోసం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామంలోని తిరిగే సమయంలో ప్రజలు ఒక వీధిలో మురుగు కాలువ సమస్య ఉందని పరిష్కరించాలని కోరారు. తక్షణం ఈ సమస్య పరిష్కరించాలని మండల అధికారులను మంత్రి ఆదేశించారు ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పిడి సచిదేవి ,నియోజవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ ఎంపీపీ వై వినోద్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం ,పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ ,తుమ్మపాల నాగేశ్వరరావు ,రెడ్డి పవన్ కుమార్ ,టిడిపి సీనియర్ నాయకులు నల్లపరాజు వెంకటరాజు ,కురందాసు నూకరాజు ,జి సత్తిబాబు (ఆశ),ప్రగడ తులసి నాయుడు ,గొర్ల దేముడు ,కాశీ,సుంకర శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జల్లూరు బ్రిడ్జి వద్ద మల్లవరం ఛానల్‌కు గండి

పరిశీలించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర-నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా, మాకవర పాలెం మండలం గిడుతూరు గ్రామంలో సోమవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కోటవురట్ల మండలం జల్లూరు బ్రిడ్జి వద్ద సుకలయ చెరువు మల్లవరం వాటర్ ఛానల్‌లో ఇటీవల గండి పడిన ప్రాంతాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించారు. తరువాత విలేకరుల సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా వాటర్ ఛానల్ గండిపడిన ప్రాంతాన్ని వెంటనే పూడ్చకపోతే సుమారు 850 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. గండి పడిన విషయం తెలుసుకున్న వెంటనే తక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గండి మరమ్మతుల కోసం అధికారులు అంచనాలు వేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు స్పీకర్ వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే, నాతవరం మండలం తాండవం రిజర్వాయర్ కింద సుమారు 53 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నదని తెలిపారు. ఈ రిజర్వాయర్ అభివృద్ధికి సంవత్సర కాలంలో రూ.6.30 కోట్ల నిధులతో 75 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అదనంగా, రూ.2.66 కోట్ల అంచనాలతో 25 పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ రిజర్వాయర్ దుగ్గాడ ఛానల్ ద్వారా కోటవురట్ల మండలంలోని 2,800 ఎకరాలకు సాగునీరు అందుతున్నదని, ఈ సంవత్సరం ఇరిగేషన్ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి 2,800 ఎకరాల భూమికి సాగునీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటామని స్పీకర్ వివరించారు. కాలువ గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన స్పీకర్, రైతుల జీవనాధారమైన కాలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా రైతులదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నాయుడు, మాకవరపాలెం మండలం పార్టీ ప్రెసిడెంట్ ఆర్ వై పాత్రుడు, ఆర్డీవో వి.వి. రమణ, ఇరిగేషన్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో ఎరువుల దుఖాణాలు

విశాలాంధ్ర-కే కోటపాడు : ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే ఎరువుల దుకాణ యజమానులకు పండుగే.. విత్తనం వేసింది మొదలు వరి కోతలు వరకు రైతులు ఎరువుల డీలర్ల చుట్టూ తిరుగుతుండేవారు. ఈ ప్రాంతంలో అందరూ చిన్న చిన్న కమతాల్లో వరి పండించే వారే ఎక్కువ. పెద్ద రైతులు ఎవరూ లేరు. వారికున్న ఎకరా అరె ఎకరా పొలంలో సంవత్సరానికి సరిపడా తిండి గింజలు ఉంటే చాలు అనుకుంటారు. ఇందుకోసం పంటకు ఎటువంటి చీడపీడలు వచ్చిన పంటను కాపాడుకోవడానికి వేలాది రూపాయలతో మందులు కొనుగోలు చేస్తుంటారు. డీలర్లు ఇచ్చిన పురుగుమందుల పైనే ఆధారపడుతుంటారు. ఇలా ఈ సీజన్లో లక్షలాది రూపాయలు లాభాలను ప్రతి డీలరు అర్జిస్తుంటారు. ఇప్పుడు పరిస్థితుల పూర్తిగా మారిపోయాయి. రైతు ఎంత విస్తీర్ణంలో పంట వేస్తున్నాడో అధికారుల వద్ద లెక్కలు ఉన్నాయి. వాటి ఆధారంగానే ఎరువులు సప్లై జరుగుతుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా తక్కువ పరిమాణంలో యూరియా అందిస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలతో వరి పండిస్తే రైతుకు అదనపు ఖర్చులు లేకుండా చూస్తున్నారు. అవసరం మేరకే పురుగు మందులు వినియోగించమని సూచనలు ఇస్తున్నారు. అదే ఎరువుల డీలర్ల వద్దకు వెళితే రైతు జేబు గుల్ల అవుతుంది. ఈ సంవత్సరం ఎరువులపై ప్రభుత్వం గట్టి నిఘా ఏర్పాటు చేసింది. నకిలీ ఎరువులు పురుగు మందులను గుర్తించి అక్కడక్కడే కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల వారం పరిధిలోనే ఈ మండలంలో రెండు మూడు దుకాణాల్లో కేసులు నమోదు చేసి నకిలీ ఎరువులను సీజ్ చేశారు. దీంతో ఎరువులు డీలర్లు బెంబేలెత్తిపోతున్నారు. ఇటువంటి నిఘా నిరంతరం కొనసాగిస్తే రైతులపై జరుగుతున్న దోపిడీని అరికట్టవచ్చునని పలువురు అంటున్నారు.

మంచినీటి పైపులైన్లకు తక్షణ మరమ్మతులు

విశాలాంధ్ర వార్తకు స్పందన

రంగు మారి దుర్వాసనతో కూడిన మంచినీరు

- అదే నీటిని తాగుతున్న కాలనీవాసులు

- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-నాతవరం: ఆగస్టు 29 న రంగు మారి దుర్వాసనతో కూడిన మంచినీరు, పట్టించుకోని అధికారులు అనే వార్తకు సోమవారం అధికారులు స్పందించి, మురికి నీటిలో ఉన్న పైపును బాగు చేయడం జరిగింది. దీనితో కాలనీవాసులకు ఇకనుండి మంచినీరు సరఫరా అవుతుందని అధికారులు తెలపడం జరిగింది. వార్తకు స్పందించిన నాతవరం గ్రామ పంచాయతీ సెక్రెటరీ, డిప్యూటీ ఎంపీడీవో లకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలు పరిష్కరించాలి

అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు

సమర్పించిన అర్జీల సమాచారానికై అర్జీదారులు 1100 కాల్ చేసి తెలుసుకోవాలి

పిజిఆర్ఎస్‌కు 260 అర్జీలు కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.అర్.ఎస్.) లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమె చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు అధికారులకు సూచించారు. అనంతరం పరిష్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా, %శ్రీ%తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. పి జి ఆర్ ఎస్ అర్జీలు జిల్లా అధికారి లాగిన్ లో ఉంటే జిల్లా అధికారి మండల అధికారి లాగిన్ లో ఉంటే మండల అధికారి నేరుగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిర్ణిత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు, సమర్పించిన అర్జీల సమాచారం కోసం అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ అర్జీదారులకు సూచించారు. ఈ రోజు పి.జి.అర్.ఎస్.లో 260 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి, భూపరిపాలన, ఏ పి ఐ ఐ సి ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, రామ మణి,ఎస్. డి. అనిత, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా గృహ నిర్మాణ, డ్వామా గ్రామీణ అభివృధి పధక సంచాలకులు శ్రీనివాస్, పూర్ణిమ దేవి, శచి దేవి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు,

జనవాణిలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర-యలమంచిలి: విజయవాడ లో మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి జనసేన భరోసా కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. పాల్గొని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల పై అర్జీలు స్వీకరించి, పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో అధికారులు జనసేన నాయకులు తదిర్లు. పాల్గొన్నారు.

జనసేన రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-గొలుగొండ: ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ను పురస్కరించుకొని గొలుగొండ మండలం ఏ ఎల్ పురం గ్రామంలో రక్తదానం శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరానికి వివిధ మండలాలు తరలివచ్చిన జనసైనికులు 90 యూనిట్లు వరకు అందజేశారు. సెప్టెంబర్ 2న నర్సీపట్నంలో బారీ స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు , రొట్టెలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉన్న జనసైనికులు వీర మహిళలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పాత కృష్ణా దేవి పేట ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, లింగంపేట ఉపసర్పంచ్ లంక సత్యనారాయణ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కొరకు నిత్యం పోరాడే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని వారన్నారు. అప్పన దొరబాబు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మారి శెట్టి రాజా మండలం, ప్రధాన కార్యదర్శి గళాసుల చిన్ని, గుణశేఖర్, పాఠశాల విద్య కమిటీ చైర్మన్ అనిశెట్టి గోపి పాతాళ శివ మాజీ ఎంపీటీసీ వత్తల నాగేశ్వరరావు జన సైనికులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పాయకరావుపేట: జాతీయ రహదారిపై పట్టణంలోని వై జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. పట్టణంలోని పండరీపురం కు చెందిన బండారు దుర్గా గోవిందు (39) కూలి పనులు ముగించుకొని మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తుండగా జాతీయ రహదారి వై జంక్షన్ వద్ద తన ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దుర్గ గోవిందు అదుపుతప్పి లారీ వెనుక భాగంలో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దుర్గ గోవిందు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

వేరు వేరు ప్రమాదంలో ఇద్దరు మృతి

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలోని జరిగిన వేరువేరు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై ఏ.విభూషణ్ రావు తెలిపారు సోమవారం తెల్లవారుజాము న అడ్డరోడ్డు సమీపంలో కోనవానిపాలెం జంక్షన్ లో ఆగి ఉన్న లారీను వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన కాసా దుర్గాప్రసాద్(28) అనే వ్యక్తికి తలకు తీవ్ర గాయం అవడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. అదే ప్రమాదంలో మహిళకు గాయాలు అయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లింగరాజుపాలెం గ్రామానికి చెందిన కొడిబోయిన సత్తిబాబు(46) వ్యవసాయం పనులు నిమిత్తం ఆదివారం వరాహనది దాటి వమ్మవరం గ్రామంకు వెళ్లడం జరిగింది. పనులు పూర్తి చేసుకొని రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి వెతకడంతో సోమవారం ఉదయం సత్తిబాబు మృతదేహం వరాహ నదిలో కనిపించింది .నీరు ఎక్కువగా ప్రవహించడంతో నదిలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోవడం వలన ప్రమాదం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గణేష్ అన్న సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు సాయినగర్‌లో వినాయక శరనవరాత్రులు భాగంగా సోమవారం శ్రీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమం కు పల్లి మంగరాజు ఆహ్వానం మేరకు పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు విచ్చేసి పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామి దర్శించుకుని అనంతరం ఆయన చేతుల మీదగా భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, ఇందల రమణ,బలిరెడ్డి అప్పారావు,గొర్లి కుమార్ స్వామి, బైలపూడి దేముడు బాబు,బంతి కోళ్ల పద్మ, పల్లా తాతారావు,కోరాడా శ్రీనివాసరావు, కోన సోమేశ్వరరావు, తాటిపాముల శేఖర్, కొల్లి కృష్ణ, జెట్టి ప్రసాద్, కర్రీ నర్సింగరావు,పల్లా రమణ, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, కొటాన రమణ, కిల్లి వెంకట సత్యనారాయణ, సబ్బవరపు రామకృష్ణ, కరణం పండు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

దేశంలోని అత్యధికంగా పెన్షన్ పంపిణీ

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు.

అర్హత లేని పెన్షన్లు తొలగింపుతో నెలకు 60 కోట్లు ఆదా



విశాలాంధ్ర-నర్సీపట్నం రూరల్ : భారతదేశంలో ఎక్కడలేని విధంగా అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ ను పెంచి పంపిణీ చేస్తుందని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మాకవరపాలెం మండలం గిడుతూరు గ్రామంలో ఆసరా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరై లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పెన్షన్ కార్యక్రమం ఈనాటిది కాదని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 1983లో 35 రూపాయలతో పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు గుర్తు చేశారు. పెన్షన్లు తొలగిస్తున్నారని అపోహలు పడద్దని , అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ అందుతుందని తెలిపారు. రాష్ట్రంలో సామాజిక పెన్షన్ కు అర్హత లేనివారు లక్ష మంది వరకు పెన్షన్ పొందుతున్నారని దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై నెలకు అరవై కోట్ల రూపాయలు వరకు భారం పడుతుందని తెలిపారు. అర్హత లేని వారి పెన్షన్ తొలగించడం ద్వారా సంవత్సరానికి సుమారు రూ. 700 కోట్ల రూపాయలు వరకు ఆదా అవుతుందని ,ఈ నిధులను పోలవరం డ్యాం కు కేటాయిస్తే పనులు కొంతమేర పూర్తవుతాయని తెలియ జేశారు. మాకవరపాలెం మండలంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, స్మశానాల అభివృద్ధికి ఇప్పటివరకు 127 పనులకు గాను రూ.12.41 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గిడుతూరు గ్రామానికి సీసీ రోడ్ల కోసం రూ.60 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఇటీవల గిడుతూరు చెరువు గండికి గురైందని మరమ్మతుల పనుల నిమిత్తం మూడు లక్షల రూపాయలతో చెరువు పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క విశాఖపట్నం కెళ్ళి అగచాట్లు పడాల్సి వస్తుందని దీంతో నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో రక్తం నిలవలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈనెల 4వ తేదీన నర్సీపట్నంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ, వివిధ శాఖ అధికారులు , రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లును తక్షణమే ఆదుకోవాలి

ఎంపీ సీఎం రమేష్ కు ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర-అనకాపల్లి: ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆదాయం ఉపాధి కోల్పో యిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకో వాలని ఎంపీ సీఎం రమేష్ కు ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోన లక్ష్మణ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా కోన లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు పెద్దిరెడ్లనాగేశ్వరరావు,కోరుబిల్లి జగదీష్ మాట్లాడుతూ. ఆటో డ్రైవర్లుకు ఓలా, ఊబర్, రాపిడ్ 2 వీలర్ లాంటి ఆన్లైన్ యాప్లు రద్దు చేయాలి, అటో డ్రైవర్లుకు వాహన మిత్ర పథకంద్వారా ఏడాదికి రూ.25,000/-లు మంజూరు చేయాలి, ప్రమాదాలద్వారా మరణించిన, అనారోగ్యంతో మరణించిన మరియు అంగవైకల్యం ఏర్పడిన ఆటో కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ తో కూడిన పి ఎం జె జె బి వై/పీఎం ఎస్ బి వై ఇన్సూరెన్స్ తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయించాలి, అధిక జరిమానాలుతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు జి.వో.నెం.21, 31లు రద్దు చేసి ఆటో, మోటార్ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లుకు పావలా వడ్డీతో ఎస్సీ, ఎస్టి, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఋణాలు మంజూరు చేయాలి ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్సు మంజూరు చేసే భాధ్యతను ప్రవేటు సంస్థలకు అప్పగించడంవలన వందలలో వేల రూపాయలలో చలానాలు భారం ఆటో డ్రైర్లపై పడుతుందిన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కోంటున్న సమస్యలను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు డి. మార్కెండేయలు, సహాయ కార్యదర్శిలు సూరిశెట్టి బాపు నాయుడు, కోణతాల రాము, సభ్యులు మంగ నాయుడు, తదితరులు ఉన్నారు.

రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం సిపిఐ, రైతు సంఘం మండిపాటు

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లాతో పాటు రాష్ట్రంలో రైతులకు యూరియా సరఫరా చేయడంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఐ నేత వైఎస్ భద్రం రైతు సంఘం ఉపాధ్యక్షుడు కోరిబిల్లి శంకర్రావు, నాయకులు మత్తుర్తి సూరిబాబు తీవ్రంగా మండిపడ్డారు.ఇంతవరకు వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నారుమల్లు బతికించుకోవడానికి అష్ట కష్టాలు పడి రైతులు నాట్లు వేసుకో గా వారికి యూరియా సరఫరా చేయవలసిన ప్రభుత్వం చేతులు వేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరతని ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని వారు విమర్శించారు. ప్రైవేట్ వ్యాపారస్తులు 270/- రూపాయలు యూరియా బస్తా రేటు ఉండగా, దానికి 300 విలువచేసే దొబ్బగులుకలు తీసుకుంటే గాని యూరియా ఇవ్వమని మెలిక పెడుతున్నారని, దీంతో రైతులు అవసరం లేకపోయినా గుళికలు కొని తీవ్రంగా నష్టపోతున్నారని వారు వాపోయారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేటు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో తనిఖీ చేయించి యూరియా బస్తాలను ఎమ్మార్పీ రేట్లు కు అమ్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని వారు ప్రభుత్వ హెచ్చరించారు.

ఆక్రమణలో ఉన్న పంచాయతీ స్థలాలు గుర్తించి, స్వాధీనం చేసుకోవాలి...

విశాలాంధ్ర-పాయకరావుపేట: పాయకరావుపేట పంచాయితీలో లేఅవుట్లలో పంచాయితీకి కేటాయించిన స్థలాలను గుర్తించి, అధికారులు స్వాధీనం చేసుకోవాలని పట్టణానికి చెందిన జగతా నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తో పాటు, స్థానిక పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాజుగారుబీడులో ఆక్రమణలో ఉన్న పంచాయితీ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లుగానే, పంచాయితీలో ఇప్పటికే ఆక్రమణలో ఉన్న పంచాయితీ స్థలాలు గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసుకోవాలని కోరారు. గతంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత రాజుగారిబీడులో ఆక్రమణలో ఉన్న పంచాయితీ స్థలాన్ని స్వాధీనం చేసుకునేం దుకు పంచాయతీ అధికారులను ఆదేశించినట్లుగానే, పంచా యితీలో ఇంకా ఆక్రమణలో ఉన్న పంచాయితీ స్థలాలను గుర్తించి, వాటిని కూడా పంచాయితీ అధికారులు స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీలో సర్వే నెంబర్ 192,193 లలో పంచాయతీ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, వాటిని గుర్తించి పంచాయతి అధికారులు స్వాధీనం చేసుకోవాలని, దీనిపై రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత చర్యలు చేపట్టాలని జగతా నాగరాజు డిమాండ్ చేశారు.

ఎం.పి. రమేష్ కు ఫ్యాక్టరీ సమస్యలపై వినతి



విశాలాంధ్ర-చోడవరం: సహకార రంగంలో రాష్ట్రంలోని చక్కెర మిల్లులు అన్నింటిలో అగ్రగామిగా పేరొందిన గోవాడ సుగర్స్ లో ప్రస్తుతం నెలకొన్న తీవ్ర సంక్షోభ పరిస్థితులపై అనకాపల్లి ఎం.పీ సీ.ఎం రమేష్ కు ఫ్యాక్టరీ కార్మిక నాయకుడు భాస్కరరావు తదితరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు ఎం.పీ తో మాట్లాడుతూ కార్మికులు, కర్షకులకు బకాయిలు మరియు ఈ ఏడాది చెరకు గానుగాటపై ప్రభుత్వంతో మాట్లాడి వివరణ ఇవ్వవలసిందిగా కోరారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని లక్షలాది వ్యవసాయ, కార్మిక కుటుంబాలకు గోవాడ సుగర్స్ జీవనాధారం అని తెలియజేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే ఆదుకొని చెరకు రైతాంగం కార్మికుల కుటుంబాలను కాపాడవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఏ.ఆర్.జి శర్మ, జిల్లా అధ్యక్షులు పరమేశ్వరరావు, చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి కందర్ప రమణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా రాజేశ్వరరావు, షుగర్ ఫ్యాక్టరీ షేర్ హెూల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గంటా సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

విశాలాంధ్ర-వి.మాడుగుల : కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ తరపున ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్షలో పనిచేసే ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 26, వేల మంది పనిచేస్తున్నారని అలాగే మాడుగుల మండలంలో 24 మంది పని చేస్తున్నారని వారికి ప్రభుత్వం తరపునుండి ఎటువంటి ఈపీఎఫ్ గానీ, ఈఎస్ఐ గాని పనికి సమాన వేతనం గాని లభించలేదని ఎంటిఎస్ లేదు. హెచ్ఆర్ పాలసీ లేదని, కనీస మినిమం పెన్షన్ కూడా లేదు. మాలో ఎవరైనా రిటైర్ అయితే గ్రాడ్యుటి ఇచ్చిన దాఖలాలు కూడా లేవని వారు తమ ఆవేదనను ఆయనకు తెలియచేశారు. తప్పకుండా మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి మీకు న్యాయం జరిగే విధంగా చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ కలిపి రిటైర్ అయిన నాగరాజేశ్వరికి 35 వేల రూపాయలు తమ సొంత నిధులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

జిల్లాలో 41,546 హెక్టార్లలో వరి నాట్లు పూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లాలో ఇప్పటి వరకు41546 హెక్టార్లలో వరి నాట్లుపూర్తిచేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. వరి పంటకు , ఇతర పంటలకు సంబంధించి 3500 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందని తెలిపారు. నేటికి జిల్లాలో 1111 మెట్రిక్ టన్నులుయూరియా ప్రైవేట్ డీలర్స్, సొసైటీలు , రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉందని, ఈ వారంలో 730 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా కొరకు, కేటాయింపు జరిగినదని తెలిపారు.యూరియా నిల్వలు , బ్లాక్ మార్కెటింగ్ చేయకుండా అధిక ధరలకు అమ్మకుండా పరిశ్రమలకు తరలించకుండా విజిలెన్సు , మల్టి డిసిప్లినరీ టీమ్స్ వారువ్యవసాయ శాఖ అధికారులతో కలసివిస్తృతంగాతనిఖీలు నిర్వహించుచున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండల పరిషత్ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు పుట్టినరోజు వేడుకలు ను ఘనంగా నిర్వహించారు .సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చాంబర్ లోని ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జడ్పిటిసి కాకర దేవి మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు భూపతి అప్పారావు ,సేనాపతి శ్రీరామ్, ధూళి శ్రీనుబాబు ,ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, మాజీ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ గుర్రం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ టీచర్ కు ఘన సత్కారం

విశాలాంధ్ర-యస్ .రాయవరం : మండలంలోని గుర్రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాదంబరి శ్రీనివాసరావు ఏ పి టి ఎఫ్ ఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రపంచ తెలుగు మహాసభలు సన్నాహక సభలో భాగంగా ఆంధ్ర సారసత్వ పరిషత్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన కవిసమ్మేళనంలోని ఈ ఉపాధ్యాయుడు కవితాలాపన చేయడంతో ఆయనను గుర్తించి ప్రశంస పత్రం అందజేయడం జరిగింది. ఆంధ్ర సారసత్వ పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ ప్రశంస పత్రాన్ని అందుకోవడం జరిగింది. అందులో భాగంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు ఆధ్వర్యంలో గల ఏపీ టిఎఫ్ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు సునీల్, కార్యదర్శి శ్రీనివాస్ సంఘం నాయకులు ఈగలపాటి గోవిందరావు ,సింహాచలం ,నానాజీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కమిషనర్ కే యస్ విశ్వనాధన్ కు..

అంచనా విలువ పత్రం సమర్పణ

కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ

విశాలాంధ్ర-యలమంచిలి: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి మంత్రి డా. పి నారాయణ యలమం చిలి మున్సిపాలిటీ పరిధిలో 23వ వార్డు కొక్కిరాపల్లి గ్రామం లో వెనకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి కై ప్రకటించిన కోటి రూపాయల పనులు సంబంధించిన అంచనా వివరాలను రాష్ట్ర రోడ్లు కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ ఇంచార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ (నానాజీ), మాజీ కౌన్సిలర్ మజ్జి వీరబాబు, పట్టణ సహాయ కార్యదర్శి పొలరౌతు గణేష్‌తో కలిసి విశాఖపట్నం వియంఆర్‌డిఏ కార్యాలయంలో కమిషనర్ కే.యస్. విశ్వనాధన్ (ఐఏఎస్) ని కలిసి. వార్డ్ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ వార్డు పనుల వివరాలు అందజేశారు.

భవన నిర్మాణసంక్షేమ బోర్డు ను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-సబ్బవరం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్దించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. మండలంలోని స్థానిక శ్రీ దుర్గామాంబ భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని కార్మికులు పోరాడి సాధించుకున్నారని దీనిని గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని భవన నిర్మాణ కార్మికుల బోర్డు డబ్బులను ఇతర పథకాలకు మళ్లించిందని నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డుని పునరుద్ధరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారని నేటికీ 14 నెలలు కావస్తున్న ఇప్పటివరకు ఎటువంటి చర్చ చేయడం లేదని డిమాండ్ చేశారు. 2019వ సంవత్సరంలో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు అందవలసిన సంక్షేమ ఫలాలు వీటిని కూడా అందకుండా చేసి కార్మిక కార్యాలయాలను నిర్వీర్యం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం మరల వెంటనే బిల్డింగ్ సంక్షేమ బోర్డుని పునరుద్ధరణ చేయాలని రన్నింగ్ క్లైములు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని ఈ చలో విజయవాడ కార్యక్రమాన్ని బిల్డింగ్ వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జి. అప్పారావు అధ్యక్షులు పూడి అప్పలనాయుడు, కోశాధికారి జి.ముత్యాల నాయుడు. ఉపాధ్యక్షులు ఏలూరి శ్రీను, గోపి సత్యం. భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొన్నారు.

భస్మ లేపన అలంకరణలో స్వయంభు గణేశుడు ....

విశాలాంధ్ర-చోడవరం : రాష్ట్రంలోని స్వయంభు విగ్నేశ్వరుని దేవాలయాలు అన్నింటిలో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరంలో స్వయంభుగా వెలసిన శ్రీ కార్యసిద్ధి గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారు విభూది అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీ శ్రీ స్వయంభు విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో ఏకాదశ రుద్ర పారాయణం, పురాణ కాలక్షేపం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు తెలియజేశారు. గణపతి నవరాత్రుల్లో ఆరవ రోజైన సోమవారం మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కృష్ణదేవిపేట ఎస్సై వై తార్కేశ్వర్ రావు

విశాలాంధ్ర-గొలుగొండ : జిల్లా ఎస్పీ తుహిన్ సింహ ప్రోత్సాహం మార్గదర్శకత్వంతో జిల్లాలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారని కృష్ణ దేవి పేట ఎస్సై వై తారకేశ్వరరావు అన్నారు. కృష్ణదేవి పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బాల్ బ్యాట్మెంటన్ క్రీడ పోటీల్లో విజయాలు సాధించారని తెలిపారు. అదేవిధంగా కృష్ణదేవి పేట ఎస్సై వై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన శ్రీకాకుళానికి చెందిన క్రీడాకారులు క్రీడల్లో రాణించారు అన్నారు. జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన పి అఖిల్ 9వ తరగతి విద్యార్థిని నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాస్ అభినందించారని తెలిపారు. ఈ క్రీడ పోటీల్లో 30 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి మెరిట్ సర్టిఫికెట్ల పొందట ఐదు మంది విద్యార్థులు ఉచిత ఇంజనీరింగ్ సీట్లు తాజాగా ముగ్గురు విద్యార్థులు ఐఐటి సీట్లు స్పోర్ట్స్ కోటలో సాధించడం విశేషం అన్నారు అంతేకాకుండా రాబోయే జాతీయ క్రీడలకు ఆరుగురు విద్యార్థులు అనకాపల్లి జిల్లా నుండి ఐదుగురు విద్యార్థులు శ్రీకాకుళం జిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపిక కావడం జిల్లా పోలీస్ శాఖకు ధర్మ కారణమన్నారు. ఈ విధంగా జిల్లా ఎస్పీ ప్రోత్సాహంతో తారకేశ్వరరావు, ఆర్ ఐ గ్రిన్స్ పెదపూడి శంకర్రావు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ మార్గదర్శకత్వం అందించడంతో ఈ విజయాలు సాధ్యమయ్యే అని తెలిపారు వీరందరూ పాలు బ్యాడ్మింటన్ క్రీడల్లో స్పోర్ట్స్ కోట ద్వారా సబ్ ఇన్స్పెక్టర్గా 2012లో ఉద్యోగాలు పొందాలని తెలిపారు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని తెప్పించేందుకు వీలు తీసుకుంటున్న చర్యలు ఫలించి ఎంతోమంది బాల్ బ్యాట్మెంటన్ క్రీడల ద్వారా రాష్ట్రస్థాయి లో ప్రతిభావంతులుగా నిలిచారని తెలిపారు. ఇవన్నీ క్రీడలు క్రమశిక్షణ కష్టపడి పనిచేయడం విద్యార్థుల విజయం భవిష్యత్తు తరాలకు ప్రేరణ కావాలని జిల్లా ఎస్పీ తుహిన్ సింహ అన్నారని ఎస్సై తెలిపారు.

కొరుప్రోలు పిఎసిఎస్ లో యూరియా పంపిణీ



విశాలాంధ్ర-యస్ .రాయవరం : కొరుప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని యూరియా పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ బ్యాంక్ పరిధిలో సుమారు 600 యూరియా బస్తాలను అమ్మకానికి తీసుకురావడం జరిగిందని పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ తెలిపారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై వినోద్ రాజు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్దం, టిడిపి సీనియర్ నాయకులు ఎన్. వెంకటరాజు ,అల్లు నరసింహమూర్తి, ప్రత్తిపాటి సత్యనారాయణ, పుట్ట సుధాకర్, కోరా రామారావు, డైరెక్టర్లు కోన అప్పలరాజు, దుబాసి రాజా ,బ్యాంక్ కార్యదర్శి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు

కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర పత్రికా విలేకరుల

విశాలాంధ్ర-యలమంచిలి : యలమంచిలి టిడిపి కార్యాలయంలో ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 30 ఏళ్ల క్రితం తొలిసారిగా సీఎంగా ఇదే రోజున బాధ్యతలు చేపట్టారు. ఈ మూడు దశాబ్దాల కాలంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు తెచ్చిన 30 అతి కీలకమైన పథకాలు మరియు కార్యక్రమాలు, సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధివైపు నడిపించాయి. దేశంలోనే సంచలనం ప్రజల వద్దకే పాలన, ముందు ఎన్నడూ చూడని ప్రజల భాగస్వామ్యం జన్మభూమి కార్యక్రమం ద్వారా జరిగింది, ప్రజా చైతన్యంతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు, బాలిక విద్యకు ప్రధాని ఇచ్చి మహిళలకు దీపం పథకం కింద లబ్ధి చేకూర్చారు, కులవృత్తులకు గౌరవం పెంచి బీసీలకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించారు, ఎస్సీలు రక్షణ కోసం పున్నయ్య కమీషన్ సూచనలను అమలు చేశారు, బీసీలకు మహిళలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించారు, మైనారిటీలకు సంక్షేమం భద్రత ప్రత్యేక పథకాలు అందించారు, తొలిసారి డ్వాక్రా మహిళా సంఘాల ను ఏర్పాటు చేశారు, విద్యుత్ రంగా సంస్కరణము అమలు చేసి ఫలితాలను చేకూర్చారు, ప్రైవేట్ రంగంలో తొలి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేశారు, టెలికాం సంస్కరణలకు కీలక సూచనలు చేశారు, పి పి విధానంలో నేషనల్ హైవేస్కు అంకురార్పణ చేసి గ్రామ గ్రామాన రోడ్లులను విస్తరించారు, ఐటీ కి ప్రాధాన్యం ఇచ్చి హైటెక్ సిటీ నిర్మాణం చేశారు, పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేశారు, 20 20 లో పాలనలకు కొత్త రూపు తీసుకొచ్చారు, జరంగంలో మార్పులు చేసి 1.80 ఎక్సల టీచర్ల నియామకం చేసి నాన్ ఎకానమీకి నాంది పలికారు, స్థానిక టూరిజంకి అత్యంత ప్రధాని వచ్చి దేవాలయాల పరిరక్షణకు కృషి చేశారు, డిజిటల్ గవర్నెన్స్ తో సేవల సులభతరం చేశారు, డిజిటల్ కరెన్సీ కి కమిటీకి నేతృత్వం వహించారు, స్వచ్ఛభారత్ కమిటీకి నేతృత్వం వహించి, అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్లో పేద ప్రజలకు ఆకలి తీర్చారు, రైతుల కోసం దేశంలో తొలిసారి ఇజ్రాయిల్ నుండి డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీని తీసుకువచ్చారు, అన్నదాతకు అండగా రైతులకు సబ్సిడీలు యాంత్రికరణ మరియు సాగునీటి ప్రాజెక్టుకు ప్రధాన్యత ఇచ్చారు, నదుల అనుసంధానంలో విజయం సాధించారు, అట్టడుగున్న దళితుల కోసం ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు, రియల్ టైం గవర్నెన్స్ తో పారదర్శకమైన పాలన అందించారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణం చేపట్టారు, పేదరిక నిర్మూలనకు పీ ఫోర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కులుకులూరు విజయరామరాజు, మండల అధ్యక్షులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లి నానాజీ, ప్రధాన కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఖైదీలకు అవగాహన

విశాలాంధ్ర-అనకాపల్లి: స్థానిక సబ్ జైల్లో ఖైదీలు ఖైదీలు నడుచుకునే తీరు, వారికి అందవలసిన సౌకర్యాలపై అవగాహన కల్పించారు. పదవ అదనపు జిల్లా జడ్జి వి. నరేష్ ఆదేశాల మేరకు నెలవారి సబ్ జైలు సందర్శనలో భాగంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఒకటవ అడిషనల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఏ. రమేష్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ కిరణ్ కుమార్,లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పిజెపి తులసీరావు, కె.వి. ఎస్ఎంఎస్ సాయిరాం, కే.వి.ఎన్. రోజా పాల్గొన్నారు .

డయాలసిస్ పేషెంట్ కు పింఛను పంపిణీ

విశాలాంధ్ర -పాయకరావుపేట: పట్టణంలోని గవరవీధిలో డయాలసిస్ పేషెంట్ కు కొత్తగా మంజూరైన రూ.10 వేల పింఛను తెలుగుదేశం పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు, పార్టీ మాజీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, మలిపెద్ది వెంకటరమణ, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, వేములపూడి అప్పారావు, రాజాన ఆది, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గుంటపల్లి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు, నామవరం పిఎసిఎస్ అధ్యక్షులు గెడ్డం కన్నబాబు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పీహెచ్ వాడలో తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి ముంజులూరి దుర్గ ప్రసాద్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. ..

ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ పంపిణీ

రాష్ట్ర యాదవ్ కార్పోరేషన్ డైరెక్టర్

విశాలాంధ్ర-రాంబిల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక భరోసా నెలవారి పింఛన్ల పథకంలో భాగంగా సోమవారం రాష్ట్ర టిడిపి కార్యదర్శి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగ నాయకులు మండలంలో హరిపురం గ్రామంలో పర్యటించి స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి వారి కుటుంబ యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి నెల సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా, లేదా అంటూ ఆరా తీశారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తున్నట్లు ఆయనకు లబ్ధిదారులు వివరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.అధికారం లోకి వచ్చిన నుంచి ఏ ఒక్క అర్హుడికి కూడా పెన్షన్ ఆపలేదని,కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తుందని, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అనర్హులు, వారి పార్టీ కార్యకర్తలకు పెన్షన్లను కేటాయించారని, ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ఏ ఒక్క అర్హులైన లబ్ధిదారుని పెన్షన్ కూడా తొలగించలేదన్నారు. కిర్లంపల్లి కామేశ్వరరావు మరణించగా ఈ నెలలో కొత్త పెన్షన్ గా ఆయన సతీమణి నారాయణమ్మకి మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు ధూళి అప్పలనాయుడు , పంచాయతీ కార్యదర్శి గంగరాజు,,సచివాలయ సిబ్బంది, నాయుకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర- వి.మాడుగుల: మాడుగుల మండలంలో ఆటో కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం మండలంలోని కేజే.పురం చెరకు కాటా వద్ద ఆటో కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియూ మండల నాయకుడు ఇరటా నరసింహమూర్తి, కె.భవాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఆగస్టు 15 నుండి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పించారని, ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదని ఇదే సమయంలో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఏటా వాహన మిత్ర కింద 25 వేలు ఆర్థిక సాయం అందించాలని, పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని జీవో నెంబర్ 21 రద్దు చేయాలని బ్యాంకుల ద్వారా 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు సబ్సిడీ ఇవ్వాలని, ఆటో కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఇంటర్, డిగ్రీ, తదితర ఉన్నత చదువులు చదివి సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఆటో, వ్యాన్, టాక్సీ తదితర మోటార్ వెహికల్స్‌ను అప్పులు చేసి సొంత డబ్బులతో కొనుక్కొని వడ్డీలు కట్టలేక, మరొక పక్క సరైన సర్వీసులు లేక పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తట్టుకోలేక ఆర్థికంగా ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వీరికి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోదమాంబ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఆడారి వెంకటసూరిఅప్పారావు, వైస్ ప్రెసిడెంట్ రేగాని రాము, సెక్రటరీ పొలిమేర సూరిబాబు, ఆటో, కార్మికులు తదితరులు పాల్గన్నారు.

నిండు ప్రాణాన్ని నిలబెట్టేది రక్తదానం ఒక్కటే

జనసేన నర్సీపట్నం సీనియర్ నాయకులు దొరబాబు

విశాలాంధ్ర -గొలుగొండ: ధనికుడైన పేదవాడైన నిండు ప్రాణాన్ని నిలబెట్టేది రక్తదానం ఒకటేనని జనసేన పార్టీ నర్సీపట్నం సీనియర్ నాయకులు అప్పన్న దొరబాబు అన్నారు. జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ను పురస్కరించుకొని గొలుగొండ మండలం ఏ ఎల్ పురం గ్రామంలో భారీ స్థాయిలో రక్తదానం శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పన్న దొరబాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే మాదిరిగానే ఈ ఏడాది వివిధ సేవా కార్యక్రమాలు తో పాటు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. రక్తదాన శిబిరానికి వివిధ మండలాలు తరలివచ్చిన జనసైనికులు 90 యూనిట్లు వరకు రక్తదానం అందజేశారని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 2న నర్సీపట్నంలో భారీ స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు , రొట్టెలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం నియోజకవర్గంలో ఉన్న జనసైనికులు వీర మహిళలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పాత కృష్ణా దేవి పేట ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, లింగంపేట ఉపసర్పంచ్ లంక సత్యనారాయణ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కొరకు నిత్యం పోరాడే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని వారన్నారు. అప్పన దొరబాబు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో మారి శెట్టి రాజా మండలం, ప్రధాన కార్యదర్శి గళాసుల చిన్ని, గుణశేఖర్, పాఠశాల విద్య కమిటీ చైర్మన్ అనిశెట్టి గోపి పాతాళ శివ మాజీ ఎంపీటీసీ వత్తల నాగేశ్వరరావు జన సైనికులు పాల్గొన్నారు.

రూ. 2 కోట్లు విలువైన పంచాయతీ స్థలం స్వాధీనం చేసుకున్న అధికారులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: పట్టణంలోని రాజుగారిబీడులో సర్వే నెంబర్ 175, 176 లలో ఆక్రమణలో ఉన్న సుమారు రూ. 2 కోట్లు విలువైన పంచాయితీ స్థలాన్ని డిప్యూటీ ఎంపీడీవో, పాయకరావుపేట పంచాయతీ ఇంచార్జి కార్యదర్శి డేవిడ్ ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ స్థలం కబ్జాకు గురైందంటూ పత్రికల్లో వార్తలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ఆక్రమణలు తొలగించి పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇంచార్జ్ కార్యదర్శిని ఆదేశించారు. ఈ మేరకు ఇంచార్జ్ కార్యదర్శి డేవిడ్ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో పంచాయతీ స్థలం ఆక్రమణలు తొలగించారు. స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ విషయమై డేవిడ్ మాట్లాడుతూ కోర్టులో గెలుచుకున్న పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందని పత్రికల ద్వారా సమాచారం తెలిసిందని, హెూం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల ప్రకారం పంచాయతీ స్థలం ఆక్రమణలో ఉన్న నిర్మాణాలు తొలగించి, పంచాయితీ స్థలాన్ని స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో పంచాయతీ స్థలాలు కబ్జాకు గురికాకుండా, కబ్జాకు గురైన వాటిని స్వాధీనం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ అధికారులు సుమారు రెండు కోట్లు విలువైన పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో ఆక్రమణలో ఉన్న మిగతా స్థలాలను కూడా సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులకు భీమా పరిహారం చెల్లించాలి

ఏఐటీయుసి జిల్లా గౌరవ అధ్యక్షులు వైయస్ భద్రం డిమాండ్

విశాలాంధ్ర-అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానంలో భాగంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి మరణించిన నిర్మాణ కార్మికులకు భీమా పరిహారం వెంటనే చెల్లించాలని ఏఐటియుసి అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు వై ఎన్ భద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మామిడి పాలెంగ్రామంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు బీమా పరిహారం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందని తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు పునరుద్ధరించి బీమా పరిహారంతో పాటు, పెండింగ్ లో ఉన్న వివాహ కానుకలు, మహిళా కార్మికుల కాన్పుల పరిహార చెల్లింపులు చేస్తామని నమ్మబలికి ఏడాది గడిచినప్పటికీ ఇంతవరకు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ లో ఉన్న క్లైములు అన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ అవసరాలకు దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులు తిరిగి బోర్డు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం అధ్యక్షులు గోపాల మహాలక్ష్మి నాయుడు, మిర్తిపాటి కాశి, ఆళ్ల శంకర్రావు, పీల రాము, ఈశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు చెల్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.